సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం ၊ 6 ၊ నవంబర్ ၊ 2024



అప్పనంగా అప్పగించేశారు!

ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టుపై ప్రభుత్వంలోని పెద్దల కన్ను పడింది. అంతే చకచకా ఫైళ్లు కదిలిపోయాయి. నెలకు రూ. 42 వేల అద్దెకు అప్పగించేశారు. 8లో ▸



మద్యం మత్తులోనే హత్య

మద్యం మత్తులో ఓ వ్యక్తిని హత్య చేసిన తణుకు పాతవూరుకు చెందిన కాజా నానాజీని పోలీసులు అరెస్ట్ చేయడంతో ఈ కేసులో మిస్టరీ వీడింది. 8లో ▸



25 స్కూటీల స్వాధీనం

ఏలూరు టూటౌన్, కైకలూరు రూరల్ సర్కిల్ పరిధిలో 25 స్కూటీలు స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్ట్ చేశారు. వీటి విలువ రూ. 17.50 లక్షలు ఉంటుందని అంచనా. 8లో ▸

నిలిచిన 108 సేవలు

- డీజిల్ బిల్లులు విడుదల కాక తిరగని వాహనాలు
- అత్యవసర సేవలకు అంతరాయం
- మూడు నెలలుగా ఉద్యోగులకు జీతాలు చెల్లించని ప్రభుత్వం

సాక్షి, భీమవరం: ఆపదలో మృత్యువుతో పోరాడుతున్న వేళ.. ఫోన్ చేసిన 15 నిముషాలకే కుయ్.. కుయ్‌మంటూ చెంతకొచ్చి ప్రాణాలను నిలిపే అపర సంజీవని 108కు సర్కారు నిర్లక్ష్య గ్రహణం పట్టింది. డీజిల్ బిల్లులు విడుదలకాక ఎక్కడికక్కడ 108 అంబులెన్స్‌లు నిలిచిపోయాయి. అత్యవసర సేవలందక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 108 అంబులెన్స్‌లు 48 ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 27, పశ్చిమ గోదావరిలో 21 వాహనాలు ఉన్నాయి. ఒక్కో వాహనం రోజుకు ఐదు నుంచి ఆరు వరకు కాల్స్ చొప్పున 288 మందికి అత్యవసర సేవలు అందిస్తాయి. ఆపదలో ఉన్న వారికి అవసరమైన ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం ఆస్పత్రులకు చేరవేస్తుంటాయి. ప్రతి రోజూ ఒక్కో 108 వాహనానికి డీజిల్ ఖర్చుల నిమిత్తం రూ. 4 వేల నుంచి రూ. 5 వేలు వరకు విడుదల చేస్తారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి సరిగా నిధుల విడుదల చేయకపోవడంతో సేవలు నిలిచిపోతూ వస్తున్నాయి. ఏలూరు జిల్లాలో రెండు రోజుల వ్యవధిలో 18 వరకు వాహనాలు నిలిచిపోగా పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం నాటికి 15 అంబులెన్స్‌లు ఆగిపోయాయి. మిగిలిన వాహనాలు డీజిల్ ఉన్నంత వరకు తిరిగి తర్వాత అవి ఆగిపోతాయని 108 సిబ్బంది చెబుతున్నారు.

వైఎస్ హయాంలో పురుడు పోసుకుని

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చేతుల మీదుగా పురుడుపోసుకున్న 108 పథకం అనతికాలంలోనే అపర సంజీవనిగా ఖ్యాతిగాంచింది. రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని దేశ వ్యాప్తంగా ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. గత టీడీపీ హయాంలో వీటి నిర్వహణ సరిగా లేక చాలా వాహనాలు మూలకు చేరి ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందక ఇబ్బంది పడాల్సి వచ్చేది. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీటికి జీవం పోశారు. అప్పటి వరకు రూ.12 వేల వరకు ఉన్న 108 సిబ్బంది జీతాలను సీనియారిటీ ప్రాతిపదికన రూ.18 వేల నుంచి రూ.30 వేలకు పెంచారు.





తణుకులోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిలిచిపోయిన 108 వాహనం, డీజిల్ లేక నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఉండిపోయిన అంబులెన్స్‌లు

మూడు నెలలుగా అందని జీతాలు

ఒక్కో వాహనానికి ఇద్దరు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ), ఇద్దరు డ్రైవర్లు ఉంటారు. వీరికి రిలీవర్లుగా రెండు వాహనాలకు కలిపి ఒక ఈఎంటీ, ఒక డ్రైవర్ ఉంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 230 మంది వరకు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. నెలకు ఒక్కో వాహనంలోని సిబ్బందికి సుమారు రూ.1.25 లక్షల చొప్పున ఉమ్మడి జిల్లాలోని సిబ్బందికి రూ. 60 లక్షల వరకు జీతాలు చెల్లించాల్సి ఉంది. మూడు నెలలుగా ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదలవ్వక రూ.1.8 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. జీతాలు అందక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. సేవలు నిలిచిపోవడంపై 108 జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్‌బాబును వివరణ కోరగా డీజిల్ బిల్లులు రావాల్సి ఉందని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

ఐదేళ్లలో 108 సేవలు ఆగడం ఇదే ప్రథమం

గతంలో రెండు మూడు రోజులు బిల్లులు ఆలస్యమైనా పెట్రోల్ బంక్‌ల యాజమాన్యాలు డీజిల్ కొట్టేవారని చెబుతున్నారు. ప్రస్తుతం 108 నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న సంస్థ తప్పుకోనుందంటూ జరుగుతున్న ప్రచారంతో బిల్లులు రావనే భయంతో అరువుపై డీజిల్ కొట్టేందుకు బంకు యజమానులు భయపడుతున్నారు. గత ఐదేళ్లలో డీజిల్ లేక 108 అంబులెన్స్‌లు ఆగడం ఇదే మొదటిసారని 108 ఉద్యోగి ఒకరు తెలిపారు. వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల వ్యవధిలో 350కు పైగా కాల్స్‌కు సేవలు అందలేదు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకం కింద ప్రతి నెలా 8, 9, 10 తేదీల్లో గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేస్తుంటారు. ఆ సమయంలో వారిని 108 అంబులెన్స్‌ల్లోనే ఆస్పత్రులకు చేరవేస్తుంటారు. రేపటి నుంచి నాలుగు రోజుల పాటు వైద్యపరీక్షలు జరుగనుండగా అంబులెన్స్ సేవలు నిలిచిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా రమణరావు బాధ్యతల స్వీకరణ



నిట్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డైరెక్టర్ రమణరావు

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ ఎన్‌వీ రమణరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్ ఎన్ఐటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు ఏపీ నిట్ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇంతకుముందు హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. రమణరావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు మేలు చేసే విభిన్న పరిశోధనలు, ప్రాజెక్టులపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. నాణ్యమైన విద్యా బోధనను విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు వారికి మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఏపీ నిట్ పురోభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు, అందజేయాలని కోరారు. నిట్‌ప్రాంగణాన్ని పరిశీలించి, బోధన, బోధనేతర సిబ్బందితో పలు విషయాలపై సూచనలు చేశారు. నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి, డీన్ రిసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ జీఆర్‌కే శాస్త్రి, డీన్‌లు టి.కురుమయ్య, ఎస్.జయరామ్, కార్తీక్ శేషాద్రి, అసోసియేట్ డీన్ వి.సందీప్, పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అంతర్జాతీయ చిత్రకళ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తణుకులో పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: అంతర్జాతీయ చిత్రకళ పోటీల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి బంగారు పతకాలు సాధించారు. ఇటీవల హైదరాబాద్ ఎంగ్ ఎన్ ఓఎస్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళ పోటీల్లో పాఠశాల విద్యార్థులు 12 మంది బంగారు పతకాలు పొందగా, 24 మంది జ్యూరీ హానర్ సాధించారని పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన పూర్వ చిత్రకళ ఉపాధ్యాయుడు డాక్టర్ వెంపటాపును పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు శైలజ, కృష్ణ, వీరభద్రం, సోమేశ్వరరావు, పెద్దిరాజు, వీరబాబు, పాపారావు, రాధా సురేంద్ర తదితరులు అభినందించారు.

అయోధ్య రాముడి ధనుస్సుకు పూజలు



పూజలందుకున్న అయోధ్య రాముడి ధనుస్సు

పాలకొల్లు సెంట్రల్: అయోధ్యలో రాముడికి అలంకరించనున్న ధనుస్సుకు మంగళవారం పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాత చల్లా శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ ఈ ధనుస్సును 13 కేజీలు వెండి, 1 కేజీ బంగారంతో చెన్నైలో నాలుగు నెలలు క్రితం తయారు చేయించినట్లు తెలిపారు. దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలకు ఈ ధనస్సును తీసుకువెళ్లి పూజలు చేయించి, వచ్చే ఏడాదికి అయోధ్య రాముడికి అలంకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో యువతరంగ్

నూజివీడు: స్థానిక ట్రిపుల్‌ఐటీలో మంగళవారం యువతరంగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. సంగీతం, నృత్యం, నాటకం విభాగాల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ 7 స్థానాల్లోను, శ్రీకాకుళం 4 స్థానాల్లోను, ఇడుపులపాయ 2 స్థానాల్లో విజయం సాధించాయి. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో శ్రీకాకుళం 2, ఒంగోలు 2, ఇడుపులపాయ 1 స్థానంలోను, సాహిత్య విభాగంలో ఒంగోలు 2, ఇడుపులపాయ 2, నూజివీడు ఒక స్థానంలో విజయం సాధించాయి. మొత్తంగా నూజివీడు 8, శ్రీకాకుళం 6, ఇడుపులపాయ 5, ఒంగోలు 4 స్థానాల్లో విజయం సాధించి అర్హత సాధించాయి.

సిండికేట్ కావాల్సిందే

- మద్యం షాపుల వ్యాపారులపై నియోజకవర్గ నేత ఒత్తిడి
- ఇప్పటికే వీరవాసరం, భీమవరం మండలాల్లోని షాపుల సిండికేట్
- భీమవరం పట్టణంలోని 24 షాపులు సిండికేట్ కావాలని ఆదేశాలు

భీమవరం: భీమవరం నియోజకవర్గంలోని మద్యం షాపులన్నీ సిండికేట్ కావాలని వ్యాపారులపై నియోజకవర్గ నేత ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నూతన మద్యం పాలసీలో భాగంగా నియోజకవర్గంలోని భీమవరం పట్టణంలో 24, భీమవరం మండలంలో 8, వీరవాసరం మండలంలో 4 మద్యం షాపులు ఏర్పాటయ్యాయి. గత నెలలో తాత్కాలిక లైసెన్స్‌తో షాపులను ఏర్పాటుచేయగా ఈనెల 7వ తేదీలోగా పర్మినెంట్ లైసెన్స్‌తో షాపులను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో ఏ ప్రాంతంలో షాపులుండాలి, ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే ఎంత అదనంగా వసూలు చేయాలనే దానిపై ఒక నిర్ణయానికి రావడానికి వ్యాపారులంతా సిండికేట్ కావాలని అదృశ్య శక్తి ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే వీరవాసరం, భీమవరం మండలాల్లోని షాపుల యజమానులు సిండికేట్ కాగా భీమవరం పట్టణంలోని 24 షాపుల యజమానులు కూడా తప్పనిసరిగా సిండికేట్ కావాలని వారిపై ఒత్తిడి చేస్తున్నట్లు చెబుతున్నారు. అంతా సిండికేట్ అయితే మద్యం వ్యాపారం తమచేతిలో ఉండదని, దీంతో లాభాలు వస్తాయో.. నష్టాలు చూపిస్తారోననే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆదృశ్యశక్తి ఎవరనేది బయటపెట్టడానికి షాపుల యజమానులు భయపడుతున్నారు.

నేడు అథ్లెటిక్స్ పోటీలు

ఉంగుటూరు: కైకరం హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్ 14 బాల, బాలికల అథ్లెటిక్స్ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్ జరగనున్నాయి. ఈమేరకు హెచ్ఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో హైస్కూల్ గ్రౌండ్‌ను పోటీలకు సిద్ధం చేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 650 మంది క్రీడాకారులు, 100 మంది పీడీలు, కోచ్‌లు రానున్న దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎమ్మెల్యే పత్సమట్ల తదితరులు హాజరుకానున్నారు.

రైతులకు ఏం చేశావు బాబు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం



సాక్షి, భీమవరం: సీఎం చంద్రబాబు రైతు సంక్షేమానికి చేసిందేమీ లేకపోగా ఉన్న పథకాలకు ఎగనామం పెట్టే పనిలో పడ్డారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం మండిపడ్డారు. తాడేపల్లిగూడెంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసి ప్రీమియం భారాన్ని రైతులపై మోపారన్నారు. రైతుల తరపున గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.3,022 కోట్లను బీమా కంపెనీలకు చెల్లించిందన్నారు. ఇప్పుడు ఆ భారం రైతులపై పడనుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఖరీఫ్ పూర్తవుతున్నా ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్‌తో సంబంధం లేకుండా ప్రతి ఆక్వా రైతుకు యూనిట్ విద్యుత్ 1.50 పైసలకే ఇస్తానన్న హామీ ఏమైందో తెలియని పరిస్థితి ఉందన్నారు. పంట కోల్పోయిన రైతులకు ఇంత వరకు సాయం అందలేదన్నారు.

మోగిన ఎన్నికల నగారా

- డిసెంబర్ 5న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక
- ఈ నెల 11న నోటిఫికేషన్, 18 వరకు నామినేషన్ల స్వీకరణ
- గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదుకు నేడు తుది గడువు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: జిల్లాలో ఎన్నికల నగారా మోగింది. ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందిన షేక్ సాబ్జీ మరణంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ స్థానానికి ఎన్నిక కోసం ఈ నెల 11 నుంచి 18వ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. వచ్చే నెల 5న ఎన్నిక జరుగుతుంది. ఎన్నిక నేపథ్యంలో మంగళవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు అధికారికంగా ప్రకటించారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ మంగళవారం విడుదలైన క్రమంలో కోడ్ అమలులోకి వచ్చింది. ఏలూరు నగర పాలక సంస్థలో మూడు ప్రత్యేక బృందాలు, మున్సిపాల్టీల్లో కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీఓల నేతృత్వంలో బృందాలు ఎన్నికల కోడ్ అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ 2023 డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఈ ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ నెల 11 నుంచి 18 వరకు కాకినాడ జిల్లాలోని కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. 19న పరిశీలన, 21న ఉపసంహరణ ఉంటుంది. డిసెంబర్ 5న ఓటింగ్ నిర్వహిస్తారు. ప్రతి మండలంలో ఓ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. డిసెంబర్ 9న కౌంటింగ్ నిర్వహించి 12తో ఎన్నికల ప్రక్రియ ముగించనున్నారు. మరోవైపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు వీలుగా జిల్లాలో ఓటర్ల నమోదు కార్యక్రమం బుధవారంతో ముగియనుంది.

పాత జిల్లా ప్రాతిపదికనే..

గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు రెండింటిని పాత జిల్లా ప్రాతిపదికనే నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ప్రకటించారు. ఏలూరు (కైకలూరు, నూజివీడు మినహా) పశ్చిమగోదావరి జిల్లాతో పాటు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ ఓటర్లు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 5 జిల్లాలు కలిపి 13,677 మందితో ఓటర్ల జాబితా సిద్ధం చేశారు. కొత్తగా 2,774 మంది ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం తుది జాబితాను ప్రకటించనున్నారు.

పేదల ఇళ్ల కూల్చివేత అన్యాయం



ప్రకాశంచౌక్ సెంటర్‌లో సీపీఎం నిరసన ర్యాలీ

భీమవరం: ఆకివీడు మండలం ఐ భీమవరంలో పేదల ఇళ్ల కూల్చివేతను వ్యతిరేకిస్తూ భీమవరం ప్రకాశం చౌక్‌లో మంగళవారం సీపీఎం నిరసన ర్యాలీ నిర్వహించింది. పార్టీ పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు మాట్లాడుతూ పేదల ఓట్లతో గెలిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అధికారం చేపట్టిన తర్వాత ఆ పేదలపైనే యుద్ధం చేయడం మంచిదికాదన్నారు. ఇళ్లు తొలగించడానికి సమయం కావాలని పేదలు వేడుకున్నా నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కాలువల పక్కన నివాసం వల్ల నీరు కలుషితమవుతుందని చెప్పడం ఎమ్మెల్యే చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. పేదలపై తన ప్రతాపాన్ని చూపించడం అన్యాయమన్నారు. కూల్చిన ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని, ప్రభుత్వమే ఇల్లు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

● నాగేంద్రుడికి పూజలు



నాగుల చవితి సందర్భంగా సోమవారం పశ్చిమ గోదావరి జిల్లాలో పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్ట వద్ద పాలు, గుడ్లు, పండ్లు సమర్పించారు. అత్తిలి ఘంటా వారి పుంతలో పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. -అత్తిలి

రీచార్జ్ చేస్తేనే కరెంట్

- ఉమ్మడి జిల్లాలో స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఏర్పాట్లు
- తొలుత ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో ఏర్పాటు
- బకాయిలు, విద్యుత్ చోరీ బాధ ఉండదంటున్న అధికారులు
- పేదలు, గిరిజనులకు ఇబ్బందే



ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు

బుట్టాయగూడెం: సెల్‌ఫోన్ ప్రీ పెయిడ్ రీచార్జ్‌లాగా ఇకపై రీచార్జ్ చేసుకుంటేనే ఇంట్లో విద్యుత్ వెలుగులు.. మన ఖాతాలో డబ్బులు అయిపోతే వెంటనే కరెంట్ కట్.. ఈ విధానం అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు తీసుకురానున్నారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న ఈ స్మార్ట్ మీటర్ల విధానంలో ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి. అందులో బ్యాలెన్స్ ఉన్నంత వరకూ స్మార్ట్ మీటర్ నుంచి కరెంట్ వస్తుంది. రీచార్జ్ అయిపోతే చీకట్లో మగ్గాల్సిందే.. ప్రీపెయిడ్ ఆప్షన్‌తో ఈ విద్యుత్ మీటర్లు రూపొందించారు. సాధారణంగా నెలలో వినియోగించిన విద్యుత్ బిల్లు మరుసటి నెలకు చెలిస్తుంటారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకూ ఎలాంటి అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ నేపథ్యంలో వినియోగదారుడు బిల్లు చెల్లించడానికి నెల వరకూ సమయం ఉంటుంది. ఇంతవరకూ అనుసరిస్తున్న ఈ విధానం వినియోగదారుడికి సౌకర్యంగానే ఉంది. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా దశల వారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మీటర్లలో ప్రీపెయిడ్ ఆప్షన్ జత చేశారు. దీని ద్వారా విద్యుత్ సరఫరా కోసం ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి. అలా చేయకపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.


అందుబాటులోకి యాప్

గతంలో మాన్యువల్ మీటర్లు ఉండేవి. వాటిని చూసి రీడింగ్ రాసుకునేవారు. ఇప్పుడు స్కాన్ రీడింగ్ చేస్తే ఆటోమెటిక్‌గా రికార్డు అవుతుంది. దీని ద్వారా వినియోగదారుడికి బిల్లు వచ్చేది. స్మార్ట్ మీటర్లకు రీడింగ్ తీయాల్సిన అవసరం లేదు. మొబైల్ రీచార్జ్, డిష్ టీవీలకు రీచార్జ్ విధానంలోనే స్మార్టు మీటర్లకు రీచార్జ్ చేసుకోవాలి. ఇందుకు త్వరలో యాప్ అందుబాటులోకి రానున్నట్లు అధికారులు తెలిపారు. ఎంత విద్యుత్ వినియోగించుకున్నది సెల్‌ఫోన్‌లో బ్యాలెన్స్ ఎలా చూసుకుంటామో అదే విధంగా యాప్‌లో చెక్ చేసుకోవచ్చు.

మొదటిగా ప్రభుత్వ కార్యాలయాలకు..

మొదటిగా ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధి సుమారు 25 వేల ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా వీటిలో ఇంతవరకూ 10 వేల కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన కార్యాలయాలకు త్వరలోనే మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. 2 లక్షలకు పైగా గృహాలకు, షాపులకు ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.


బకాయిల బాధ ఉండదు



ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల వంతు వచ్చింది. ప్రీపెయిడ్ ఆప్షన్‌తో రూపొందించారు. సెల్‌ఫోన్, డిష్ టీవీలో ఎలా రీచార్జ్ చేసుకుంటారో అదే పద్ధతిలో స్మార్ట్ మీటర్లకు రీచార్జ్ చేసుకోవాలి. దీని వల్ల బకాయిల బాధ ఉండదు. విద్యుత్ చౌర్యం జరిగే అవకాశం ఉండదు.

– పీర్ అహ్మద్ ఖాన్, ఏపీఈపీడీసీఎల్ ఈఈ, జంగారెడ్డిగూడెం

స్మార్ట్ మీటర్లతో పేదలపై భారం



ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పేదలపై భారం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు ఇబ్బందులు ఏర్పడతాయి. ప్రీపెయిడ్ రీచార్జ్ ఆదివాసీలు వినియోగించుకోలేరు. దీని వల్ల చీకట్లో ఉండే పరిస్థితి ఏర్పడుతుంది.

– తెల్లం రామకృష్ణ, సీపీఎం నేత, బుట్టాయగూడెం

స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు..

- విద్యుత్ సంస్థను నమ్ముకుని ఎన్నో ఏళ్లగా మీటర్ రీడర్లు పని చేస్తున్నారు. ఈ విధానం పూర్తి స్థాయిలో అమలు జరిగితే వారందరి ఉపాధికి పెద్ద దెబ్బ
- అవగాహన లేమితో రీచార్జి చేసుకోవడంలో వినియోగదారుడు ఏ మాత్రం అలసత్వం వహించినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.
- స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో బకాయిల బాధ ఉండదని, విద్యుత్ చౌర్యం ఉండదని అధికారులు చెబుతున్నా విద్యుత్ స్తంభాల లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

మద్యం బాటిళ్ల స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలు, నిందితులతో ఎస్సై

ముదినేపల్లి రూరల్ : మండలంలోని వైవాక గ్రామంలో ముగ్గురు వ్యక్తులు బెల్టుషాపు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై వీఎస్ వీరభద్రరావు తన సిబ్బందితో దాడి చేశారు. రూ.18570 విలువైన 120 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సుబ్రహ్మణ్యం, వేణు, సుబ్బరాజు అనే వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. ఎవరైనా మద్యం అక్రమ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

చింతలపూడి: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మండలంలోని తిమ్మిరెడ్డిపాలెంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న తాళం మాధవరావును అరెస్ట్ చేసి, ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. మాధవరావుపై కేసు నమోదు చేశామన్నారు. చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



ఎర్రవెంకయ్య మృతదేహం

కొయ్యలగూడెం: వ్యసనాలకు బానిసైన వృద్ధుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై వి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. అంకాలగూడెం గ్రామానికి చెందిన పెన్నాడ ఎర్రవెంకయ్య (60) మద్యానికి బానిసయ్యాడు. పింఛన్ సొమ్ము మొత్తం మద్యం తాగుతూ గడుపుతుండడంతో భార్య సరస్వతి ఇల్లు ఎలా గడుస్తుందని ఎర్రవెంకయ్యతో వాగ్వాదానికి దిగింది. అనారోగ్య రీత్యా సరస్వతి మందుల కోసం అమలాపురం వెళ్లగా.. ఆ సమయంలో భర్త వెంకయ్య పురుగుమందు సేవించాడు. అతనిని స్థానికులు జంగారెడ్డిగూడెం, అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యానికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

లిఫ్ట్ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు టౌన్: ఏలూరు అశోక్‌నగర్ గంగానమ్మ గుడి సమీపంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ ఆకస్మికంగా తెగి పడిపోవడంతో అందులోఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. బొప్పన మన్మదరావు ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు కాళ్లు విరిగినట్టు పేర్కొన్నారు.

అప్పనంగా అప్పగించేశారు!

- ఫుడ్‌కోర్టు వ్యవహారంలో పారదర్శకతకు పాతర
- ఏడాదికి రూ.55.44 లక్షల నష్టం



నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని ఫుడ్‌కోర్టు

నూజివీడు: విద్యార్థుల సౌకర్యార్థం ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టుపై ప్రభుత్వంలోని పెద్దల కన్ను పడింది. అంతే చకచకా ఫైళ్లు కదిలిపోయాయి. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందంటూ మెప్మా ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఉన్న టౌన్ లెవెల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్)కు నెలకు రూ.42 వేల అద్దెకు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం అప్పగించేసింది. పేరుకే టీఎల్ఎఫ్, నిర్వహణ వేరే వారు కావడం గమనార్హం. ఈ నిర్ణయం ద్వారా రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ)కి అద్దె రూపంలో ప్రతి నెలా రూ.4.62 లక్షలు, ఏడాదికి రూ.55.44 లక్షలు నష్టం చేకూరుతోంది. అద్దె రూపంలో వచ్చే డబ్బులు మెస్ బిల్లులు లేదా విద్యుత్ బిల్లులు చెల్లించడానికి ఉపయోగపడేవి. ఇందుకు విరుద్ధంగా యాజమాన్యం తీసుకున్న నిర్ణయం పట్ల ట్రిపుల్ ఐటీ వర్గాలే ఆశ్చర్యపోతున్నాయి.

గతంలో నెలకు రూ.5.94 లక్షల అద్దె

ఫుడ్ కోర్టును గతంలో నిర్వహించిన నిర్వాహకులు నెలకు రూ.5.04 లక్షల అద్దెతో పాటు దానికి అదనంగా జీఎస్టీ 18 శాతం చెల్లించేవారు. ఆ లెక్కన జీఎస్టీతో కలిపి మొత్తం రూ.5.94 లక్షలు చెల్లించేవారు. నిర్వాహకులపై ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఫుడ్‌కోర్టు కాంట్రాక్టును రద్దు చేయడంతో మూతపడింది. అయితే ట్రిపుల్ ఐటీ యాజమాన్యం మళ్లీ టెండర్లు పిలిచి కొత్త నిర్వాహకులకు ఫుడ్ కోర్టును అప్పగించాల్సింది పోయి ప్రభుత్వం చెప్పిందంటూ.. టీఎల్ఎఫ్‌తో ఆర్జీయూకేటీ అధికారులు ఇటీవల ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఫుడ్ కోర్టుతో పాటు నాలుగు ఫ్యాన్సీ షాపులు, రెండు సెలూన్‌లు, రెండు జిరాక్స్ షాపులు, బాలికలకు పార్లర్లను అప్పగించేశారు. వీటికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చదరపు అడుగుకు ఎంత అద్దె అయితే ఆ లెక్కన చెల్లించే ఒప్పందంతో అద్దెను నిర్ణయించారు. ఇది కూడా నామమాత్రంగానే ఉంటుంది.

పేరుకే సంఘాలు

స్వయం సహాయక సంఘాల నిర్వహణ పేరుకేనని, నిర్వహించేది వారు కాదని ట్రిపుల్ ఐటీ విద్యార్థులే చెబుతున్నారు. ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఫ్యాన్సీ షాపులు లేదా ఫుడ్ కోర్టు కట్టుదిట్టమైన టెండర్ల ద్వారా మాత్రమే అప్పగించేవారు. కూటమి ప్రభుత్వం రాగానే నిబంధనలన్నింటినీ పక్కన పెట్టేసి, ఆర్జీయూకేటీకి నష్టం వాటిల్లుతున్నా యాజమాన్యం టీఎల్ఎఫ్‌కు అప్పగించేసింది.

డీఈఓను కలిసిన నాయకులు



డీఈఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎం వెంకటలక్ష్మమ్మను పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తానని డీఈఓ హామీ ఇచ్చారు. ఆమెను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ నాయకులు బీఏ సాల్మన్ రాజు, టి.రామారావు, బి.రెడ్డిదొర, డీకేఎస్ఎస్ ప్రకాష్‌రావు, అబ్బదాసరి శ్రీనివాస్, పీఆర్‌టీయూ నాయకులు పువ్వుల ఆంజనేయులు, కేవీవీ సుబ్బారావు, కె.సూర్యనారాయణ, పి.ఏసురాజు, బి.ధర్మారావు, ఈ.సన్యాసిరావు, డీటీఎఫ్ నాయకులు ఎం ఆదినారాయణ, కె.కాంతారావు, ఎస్‌పీ శ్రీనివాసరావు, కె.దాసు, ఎస్‌వీ సుబ్బారావు తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈఓ

ఏలూరు(మెట్రో): డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. కలెక్టర్ డీఈఓకు అభినందనలు తెలిపారు.

శ్రీవారి తెప్పోత్సవానికి శరవేగంగా ఏర్పాట్లు



పుష్కరిణిలో చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: చినవెంకన్న తెప్పోత్సవానికి శ్రీవారి పుష్కరిణి (నృసింహ సాగరం) సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 13న రాత్రి స్వామివారి తెప్పోత్సవ వేడుకను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. పుష్కరిణి మధ్యలో ఉన్న మండపాన్ని, సాగర పరిసరాలను, తెప్పను రంగులతో తీర్చిదిద్దుతున్నారు. సాగరంలోని తూడు, నాచు, చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. గట్లపై ఉన్న ముళ్ల పొదలను ఇప్పటికే తొలగించారు. ఉత్సవం జరిగే రోజు రాత్రి స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి తొళక్క వాహనంపై క్షేత్ర వీధుల్లో ఊరేగి, ఎనిమిది గంటల సమయంలో పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. ఆ తరువాత తెప్పోత్సవం ప్రారంభం కానుంది.

25 స్కూటీల స్వాధీనం : ముగ్గురి అరెస్ట్



రికవరీ చేసిన మోటారు సైకిళ్లను పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని ఏలూరు టూటౌన్, కైకలూరు రూరల్ సర్కిల్ పరిధిలో 25 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని, ముగ్గుర్ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ విలేకర్లకు వివరించారు. 25 మోటారు సైకిళ్ల విలువ సుమారు రూ.17.50 లక్షలు ఉంటుందని అంచనా. ఏలూరు సబ్బులవారి వీధికి చెందిన పూతి ప్రసాద్, నడిపూడి అప్పలనాయుడు, నాగాంజనేయులు అనే ముగ్గురు దొంగలు పట్టుబడ్డారు. పూతి ప్రసాద్‌పై గతంలో ఏలూరు, హనుమాన్ జంక్షన్, తాడేపల్లిగూడెం, తణుకు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు చోరీ కేసులు నమోదయ్యాయి. అప్పలనాయుడు గతంలో ఏలూరులోని ఒక మోటారు సైకిల్ షోరూమ్‌లో మెకానిక్‌గా పని చేస్తూ ఉండేవాడు. వీరిపై ఏలూరు, కైకలూరు, భీమవరం రూరల్, ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, తాడేపల్లిగూడెం, కలిదిండి, ముదినేపల్లి పోలీస్ స్టేషన్లలో 16 చోరీ కేసులు ఉన్నాయని ఎస్పీ వివరించారు. ఈ కేసులను చేదించటంలో ప్రతిభ చూపిన ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ, కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్, ఏలూరు సీసీఎస్ సీఐ రాజశేఖర్, కలిదిండి ఎస్సై వి.వెంకటేశ్వరరావును, పోలీస్ సిబ్బందిని ఎస్పీ శివకిషోర్ అభినందించి, ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహం అందజేశారు. సమావేశంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

కేసులు ఎత్తివేయాలని ఉద్యోగుల వినతి

ఏలూరు టౌన్: సీపీఎస్ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులపై గతంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జేఏసీ నేతలు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్‌ను కోరారు. మంగళవారం జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులంతా ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీను కలిసి సమస్యను తెలిపారు. సీపీఎస్ ఉద్యమంలో భాగంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలనీ, కేసులకు సంబంధించి ప్రాసిక్యూషన్ విత్‌డ్రాల్‌ను ఫైల్‌చేసి కోర్టుకు సమర్పించాలని కోరారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ కేసుల పూర్వాపరాలను పరిశీలించి, వాటిపై సరైన రీతిలో చర్యలు చేపడతామనీ జేఏసీ నేతలకు హామీ ఇచ్చారు. ఎస్పీను కలిసిన వారిలో రాష్ట్ర జేఏసీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్ హరనాథ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముస్తాక్ ఆలీ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వల ఆంజనేయులు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి గగ్గులోతు కృష్ణ, డీటీఎఫ్ అధ్యక్షుడు ఆదినారాయణ, సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు కే.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

515.160 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఇంతవరకు రూ.1.31 కోట్లు విలువైన 515.160 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం చింతలపూడి తదితర ప్రాంతాల్లో పర్యటించామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2024–25 ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి 250 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు కామన్ రకం రూ.2,300, గ్రేడ్ ఏ రకం రూ.2,320 చొప్పున విక్రయించేందుకు రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని అన్నారు. సిబ్బంది స్వయంగా కల్లాల వద్దకొచ్చి ధాన్యం పరీక్షించి, నిబంధనల ప్రకారం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైసు మిల్లుకు తరలిస్తారని చెప్పారు. 48 గంటలలోపే రైతు ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాలో ధాన్యం సొమ్ము జమ చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని ఆమె తెలిపారు.

శ్రీవారి సేవలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి మంగళవారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం ఆమెకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచారి స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దు



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న విజయరాజు

చింతలపూడి : వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధైర్యపడొద్దని ఆ పార్టీ నియోకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పిలుపునిచ్చారు. మండలంలోని యండపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ నేత మోరంపూడి శ్రీనివాసరావును వుంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరావుర్శించారు. ఇటీవల శ్రీనివాసరావును బహిరంగ వేలంలో పాడుకున్న చెరువలో చేపలు పట్టకుండా గ్రామ టీడీపీ నాయకులు వేధింపులకు గురి చేయడంతో ఆదివారం ఆయన గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావుకు ధైర్యం చెప్పి పార్టీ అండగా ఉందని విజయరాజ హామీ ఇచ్చారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు నాయకులపై దాడులను ఎదుర్కొనేందుకు ఒక కమిటీని ఏర్పాటుచేశారని, నియోజకవర్గ ఇన్‌చార్జీలకు, పార్టీ నాయకులకు కూడా ఆదేశాలిచ్చారని చెప్పారు. శ్రీనివాసరావు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేకూరే విధంగా పోరాటం చేద్దామన్నారు. సర్పంచ్ యడ్ల మోహన్‌రావు, పార్టీ నాయకులు టి.శ్రీనివాసరావు, గిరి భిక్షగారావు గద్దే ప్రసాద్, సీహెచ్ నాగేశ్వరరావు, మిరియాల దిలీప్, తాటిపర్తి రాజు, పి.మాదవరెడ్డి, గ్రావుంలోని వైఎస్సార్ సీపీశ్రేణులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు నూజివీడు విద్యార్థులు

నూజివీడు: ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ అండర్–14 జాతీయ స్థాయి పోటీలకు నూజివీడు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–14 బాలబాలికల రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఆరుగురు బాలబాలికలు చత్తీస్‌ఘడ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో బొల్లిపాం కుసుమ, ఆర్ వాహిని, స్టాండ్‌బైగా బి.వర్షిణి, బాలుర విభాగంలో జి.జగదీష్, పి.కేతన్‌సాయి, స్టాండ్‌బైగా ఆకాశ్ ఎంపికయ్యారు. వీరు నూజివీడులోని విక్టోరియా పురమందిరంలోని బాస్కెట్ బాల్ కోర్టులో కోచ్, పీడీ వాకా నాగరాజు వద్ద బాస్కెట్‌బాల్ శిక్షణ పొందారు.

సూర్యారావుపాలెం ఘటనలో ఆరుకు చేరిన మృతులు

తణుకు: ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన భారీ విస్ఫోటనంలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. గత నెల 30న బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన ఘటనలో తణుకు మండలం వెంకట్రాయపురం గ్రామానికి చెందిన వేగిరోతు శ్రీవల్లి, పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీతలు ఘటనా స్థలంలోనే సజీవదహనమయ్యారు. తీవ్రంగా గాయపడిన మరో ఐదుగురిలో విప్పర్తి వెంకటేశ్వరరావు చికిత్స పొందుతూ మృతి చెందగా, మంగళవారం తణుకు మండలం దువ్వకు చెందిన కడియం కుమారి, పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన శీలం లక్ష్మి, మండలంక కమలరత్నం చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రస్తుతం దువ్వకు చెందిన చుక్కా పెద్దింట్లు చికిత్స పొందుతున్నారు. ఈమె పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు.

పెనుగొండలో యువకుడి కిడ్నాప్

పెనుగొండ: ఇరగవరం మండలం అయితంపూడికి చెందిన కొప్పినీడి వెంకట సాయిబాబు (27)ను ఈ నెల 1న పెనుగొండ – సిద్ధాంతం రహదారిలో నక్కల కాలువ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్టు ఫిర్యాదు అందిందని ఎస్సై కొప్పిశెట్టి గంగాధర్ మంగళవారం తెలిపారు. సాయిబాబు తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. పెనుగొండలో టాక్స్ కన్సల్టెంట్ కార్యాలయాన్ని నడుపుతున్న సాయిబాబు గతంలో ఆచంటకు చెందిన యువతిని ప్రేమించాడు. కులాలు వేరు కావడంతో యువతి తల్లిదండ్రులు వివాహానికి అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో ఆమెకు నిడదవోలుకు చెందిన వ్యక్తితో గత నెల 17న నిశ్చితార్థం చేశారు. ఆ సమయంలో గొడవ చేయడంతో సాయిబాబుకు ఆచంట ఎస్సై కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా, పెళ్లి చేసుకోబోయి వ్యక్తికి ఫోన్‌చేసి ఇబ్బంది పెడుతుండడంతో యువతి తల్లిదండ్రులు ఆచంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 1న పెనుగొండలో సాయిబాబు కిడ్నాప్‌కు గురయ్యాడని ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులోనే హత్య



నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ విశ్వనాథ్

తణుకు: తణుకు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కాకర్ల దుర్గారావును హత్య చేసిన నిందితుడు పాతవూరుకు చెందిన కాజా నానాజీని అరెస్టు చేయడంతో మిస్టరీ వీడింది. ఈ వివరాలను మంగళవారం తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌లో తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ వెల్లడించారు. ఈనెల 1న తణుకు సజ్జాపురం ప్రాంతానికి చెందిన దుర్గారావు (33) హైస్కూల్ ఆవరణలో హత్యకు గురయ్యాడు. దీపావళి రోజు రాత్రి 8 గంటల సమయంలో నానాజీ మద్యం తాగేందుకు హైస్కూల్ ఆవరణలోని స్వామి వివేకానంద విగ్రహం వద్దకు వచ్చాడు. అక్కడ అప్పటికే మద్యం తాగి ఉన్న దుర్గారావు మద్యం కావాలని అడగడంతో నానాజీ నిరాకరించాడు. దీంతో దుర్భషలాడుతుండగా దుర్గారావు తలపై నానాజీ రాయితో మోదడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో నానాజీ అక్కడి నుంచి జారుకున్నాడు. తెల్లారేసరికి దుర్గారావు మృతి చెంది ఉండడంతో నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు తాతాజీ నిందితుడిగా నిర్ధారించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తణుకు మండలం మండపాక గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న నానాజీ ఇంటికి సరిగ్గా వెళ్లకపోగా పలు సినిమా హాళ్లలో సైతం మరుగుదొడ్లు శుభ్రం చేస్తూ వచ్చిన డబ్బులతో జీవిస్తున్నాడు. దుర్గారావు హత్య విషయంలో ఎలాంటి రాజకీయ కోణం లేదని డీఎస్పీ తెలిపారు. అసత్య వార్తలు ప్రసార మాధ్యమాల్లో వ్యాపింపజేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసును చేదించడంలో విశేష కృషి చేసిన తణుకు పట్టణ, రూరల్ సీఐలు కె.కొండయ్య, ఎం.కృష్ణకుమార్, ట్రాఫిక్ ఎస్సై డి.ఆదినారాయణ, పట్టణ ఎస్సై కె.చంద్రశేఖర్, ఏఎస్సై ఎస్ శ్రీధర్, కానిస్టేబుళ్లు ఎంవీవీ సత్యనారాయణ, షేక్ అన్వర్, ఎం.శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, టి.రవి, డి.వెలగేశ్వరరావు, షేక్ అక్బర్ లాల్, పి.రాంబాబులను డీఎస్పీ అభినందించారు.

స్త్రీ శిశు సంక్షేమ శాఖ బలోపేతానికి కృషి



కాంట్రాక్ట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖను బలోపేతానికి కృషి చేస్తున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో వివిధ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీకి కలెక్టర్ అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మహిళలు, శిశువుల ఆరోగ్యానికి స్త్రీ, సంక్షేమ శాఖ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. మంగళవారం ఒక వైద్యుని పోస్ట్ పార్ట్ టైం పద్ధతిలో, మహిళా ఆయాలు మూడు పోస్టులకు, కేసు వర్కర్ ఒక పోస్ట్‌కు, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్ రెండు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా పోస్ట్ (ఎస్టీ)కి దరఖాస్తులు రాకపోవడంతో మరోసారి నోటిఫికేషన్ జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. కొత్త ఉద్యోగులు బాధ్యతాయుతంగా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. నియామక కమిటీ సభ్యులైన జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతా రాణి, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జువైనల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ డి.పద్మ, సీడబ్ల్యూసీ మెంబర్ పి.వెంకట్ పాల్గొన్నారు.

శశికుమార్‌పై మరో బాలిక ఫిర్యాదు

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేట శ్రీదయానంద సరస్వతి బాలికల వసతి గృహం వార్డెన్ భర్త శశికుమార్ బాలికలపై లైంగిక దాడులకు పాల్పడ్డాడంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయనపై ఇటీవల ముగ్గురు బాలికలు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ నేపథ్యంలో అతనితో పాటు భార్య, మరో యువతిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల మరో బాధిత బాలిక తాజాగా మంగళవారం ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు టూటౌన్ పోలీసులు శశికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వైద్య శిబిరానికి 27 మంది హాజరు



తణుకులో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యం అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు 27 మందికి వైద్యసేవలు అందజేశారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వృద్ధులకు వైద్యసేవలందించి ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. అనంతరం సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాద రావు, ఉపాధ్యక్షులు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఆర్టీసీ కొత్త సర్వీస్ హైర్ బస్సు ప్రారంభం



కొత్త హైర్ బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్‌ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో నుంచి మంగళవారం జంగారెడ్డిగూడెం రూట్‌లో పాత బస్సు స్థానంలో రీప్లేస్‌లో భాగంగా కొత్త హైర్ బస్సును ప్రారంభించారు. ప్రయాణీకుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బస్సు ఏర్పాటు చేశారు. పాత బస్సులు స్థానంలో కొత్త బస్సులను నడపడం ద్వారా ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నట్లు వెల్లడించారు.

8న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అత్తిలి: ఈనెల 8వ తేదీన మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పి శామ్యూల్ తెలిపారు. ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

జీవనశైలి మార్చుకోవాలి



క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సాయిచంద్ర

ఉండి: సమాజంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి వ్యక్తీ తన జీవనశైలిని మార్చుకుంటేనే క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఉంటామని ఉండి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉండి జెడ్పీ హైస్కూల్‌లో పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం వై.రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సాయిచంద్ర మాట్లాడుతూ పిల్లల్లో లుకేమియా, మెదడు, వెన్నపాము, కణితులు, లింపోమా తదితర క్యాన్సర్లు వ యన్నారు.ప్లాస్టిక్ వినియోగం జంక్‌ఫుడ్స్ తినడం మానుకోవాలన్నారు. గొట్టుముక్కల రాము సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి,కార్యదర్శి ముదునూరి శివరామరాజు,ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు,బుద్ధరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి

ఉండి: ఉండి మండలం అర్తమూరులో మంగళవారం పని చేస్తూనే పామర్తి వీరాస్వామి(80) అనే ఉపాధి కూలీ మృతి చెందాడు. పని చేస్తున్న స్థలంలోనే కుప్పకూలిపోవడంతో అతనిని వెంటనే ఇంటికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వృద్ధుని మృతి సమాచారం అందుకున్న మండల ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమేగారాజు ఘటనాస్థలికి వెళ్లి సమాచారం సేకరించారు. మృతి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరచి ప్రభుత్వం నుంచి అందే సహకారం అందించేందుకు సహకరిస్తామని తెలిపారు.

ఆకివీడు మండల యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ఆకివీడు: యూటీఎఫ్ నూతన మండల కమిటీ కార్యవర్గం మంగళవారం ఏర్పడింది. కమిటీ అధ్యక్షుడిగా జెడ్‌వీ సత్యనారాయణ, సహ అధ్యక్షుడిగా ముత్యాల వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఆర్వీఎస్ నారాయణ(విక్రమ్), కోశాధికారిగా జిల్లా వెంకటేశ్వరరావుతో పాటు కార్యవర్గం ఏర్పడింది. నూతన కమిటీ ఎన్నికల అధికారిగా జి.రామకృష్ణ వ్యవహరించారు.

అన్నదాతలకు అందని పరిహారం

- కూటమి ప్రభుత్వంలో రైతులకు అందని సాయం
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామంటూ చంద్రబాబు హామీ
- అధికారంలోకి వచ్చాక ఆ పథకం ఊసెత్తని ప్రజాప్రతినిధులు



ఎర్ర కాలువ వరద కారణంగా ముద్దాపురంలో నీట మునిగిన వరి పొలాలు (ఫైల్ ఫొటో)

తణుకు టౌన్ : రైతన్నకు సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ముగింపునకు వచ్చేసినా రైతులకు పంట నష్టం తాలూకా ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకా అందకపోవడంతో రైతులు దిగాలుగా ఎదురు చూస్తున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కొన్ని చోట్ల వరినాట్లు పూర్తి కాకుండానే ఎర్ర కాలువ ముంపు కారణంగా తణుకు మండలంలోని పలు గ్రామాలో వరినాట్లు, వరి నారుమడులు నీట మునిగి పంట నష్టం ఏర్పడింది. రైతులకు ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీని అదే సీజన్‌లో గత ప్రభుత్వం అందించేది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జూలై నెలలో జరిగిన ఎర్రకాలువ వరదల కారణంగా తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ, తేతలి, మండపాక గ్రామాల్లోని వరి పొలాలు నీట మునిగి పూర్తిగా పంట నష్టం ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారు. ఈ పంట నష్టానికి సంబంధించి అధికారులు నష్టం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించినా ఇప్పటి వరకూ రైతుల ఖాతాల్లోని ఒక్క రూపాయి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూలై నెలలో ఎర్రకాలువ (దువ్వ వయ్యేరు) వరదల కారణంగా తణుకు మండలంలోని కోనాల గ్రామంలో 250 ఎకరాలు, ముద్దాపురంలో 170 ఎకరాలు, దువ్వ గ్రామంలో 750 ఎకరాలు, మండపాక గ్రామంలో 300 ఎకరాలు, తేతలి గ్రామంలో 120 ఎకరాల వరి పంట నీటి మునిగి సుమారు 1300 మంది రైతులకు నష్టం వాటిల్లింది. పంట నష్టం జరిగిన రైతులలో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారని రైతులు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జూలై నెలలో జరిగిన భారీ వర్షాలు, వరదల కారణంగా రైతులకు ఎటువంటి నష్ట పరిహారం అందకపోగా తర్వాత అగస్టులో నెలలో సంభవించిన బుడమేరు వరద బాధితులకు మాత్రం సహాయం అందినట్లు రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయంలో ఎక్కువగా కౌలు రైతులే సేద్యం చేస్తున్నారని, వారు అనేక కష్టాలతో అప్పులు చేసి వ్యవసాయం చేసే వారికి సీజన్‌లోనే జగనన్న ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసేదని, ప్రస్తుత ఖరీఫ్ పంట కాలం పూర్తైనప్పటికి రైతులకు నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

20 రోజుల్లోనే పరిహారం అందేది



తుఫాన్‌లు, వరదల కారణంగా పంటనష్టం జరిగితే అదే సీజన్‌లో 20 రోజుల్లో జగనన్న ప్రభుత్వం పరిహారం అందజేసేది. ఈ సంవత్సరం సీజన్ ప్రారంభంలోనే ఎర్ర కాలువ వరద కారణంగా నా పొలం మొత్తం నీట మునిగి నష్టపోయాను. గతంలో రైతులకు నష్ట పరిహారం డైరెక్టర్‌గా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేది. ప్రస్తుతం నష్టం జరిగి 3 నాలుగు నెలలైనా ఇప్పటికీ పరిహారం అందలేదు.

– ముళ్లపూడి లక్ష్మణరావు, రైతు ముద్దాపురం.

కౌలు రైతులకు ఎక్కువ నష్టం



వ్యవసాయంలో సొంత భూమి గల రైతులతో పాటు కౌలు రైతులు ఎక్కువగా వ్యవసాయం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాలకు కౌలు రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. గతంలో నష్ట పరిహారం వెంటనే 20 రోజుల్లో రైతుల ఖాతాలకు జమ చేయడం వలన పెద్దగా ఇబ్బంది పడేవారు కాదు. కానీ నెలల తరబడి పరిహారం కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

– వెలగన త్రిమూర్తులు, రైతు, ముద్దాపురం

పరిహారం ఇస్తాం

జూలై నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఎర్ర కాలువ వరదలకు ముంపుకు గురై నష్టపోయిన రైతులకు త్వరలోనే ప్రభుత్వం పరిహారం అందజేస్తుంది. కొన్ని సాంకేతిక కారణాల వలన పరిహారం పంపిణీలో ఆలస్యం జరిగింది.

– కె కుసుమ, వ్యవసాయాధికారి, తణుకు

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



తణుకులో రక్తదానం చేస్తున్న సభ్యులు

తణుకు: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు కొనియాడారు. కారుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రాంగణంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు కారుమంచి యోహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 8 మంది రక్తదానం చేశారు.సభ్యులు కొమ్మర రాజేష్, గౌరి, బన్నీ, రామ్‌చరణ్, సాయి పాల్గొన్నారు.

7న ట్రస్టు ఆస్పత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు: అలంపురం వెంకటరమణ ఛారిటీ ఆస్పత్రిలో ఈనెల 7న ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు, జనరల్ సర్జన్, డెర్మటాలజీ, పల్మనాలజీ, చెవి, ముక్కు,గొంతు వ్యాధులకు చెందిన వైద్యనిపుణులు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. ఈ పరీక్షలతో పాటు, గుండె సంబందింత వ్యాధులకు సంబందించి 2డి ఈకో, ఈసీజీ, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుక



తాడేపల్లిగూడెం రూరల్: పుట్టల వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తాడేపల్లిగూడెం(టీఓసీ): పుట్టల వద్ద పూజలు చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో నాగుల చవితి వేడుక మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చినతాడేపల్లి, కొమ్ముగూడెం, మోదుగ గుంట, అప్పారావుపేట, పెదతాడేపల్లి, కృష్ణాయపాలెం, జగన్నాథపురం, కుంచనపల్లి, కొండ్రుప్రోలు, ఆరుగొలను, నవాబుపాలెం, నందమూరు, పట్టెంపాలెం తదితర గ్రామాల్లోని సుబ్బారాయుడి ఆలయాలను భక్తులు దర్శించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు నిత్య పూజలతో పాటు ఆవు పాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అలాగే గ్రామాల్లోని ప్రకృతి సిద్ధ పుట్టల వద్ద భక్తులు పాలు, గుడ్లు, చలిమిడి, చిమ్మీ, వడపప్పు వంటివి నివేదించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. పలువురు చిన్నారులు పుట్టల వద్ద బాణాసంచా కాల్చి సందడి చేశారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): నాగుల చవితి పర్వదినాన్ని పట్టణంలో మంగళవారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని సుబ్బారాయుడు ఆలయాలకు భక్తుల తాకిడి కనిపించింది. ఆలయాలు వద్ద పాలాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. ఊరి శివారు ప్రాంతాలలో సహజ సిద్ధ పుట్టల వద్ద మహిళలు, యువతీ, యువకులు, చిన్నారులు, పెద్దలు గుడ్లు, పాలు, చలిమిడి, పానకాలు సమర్పించారు. బాణ సంచా కాల్చి సందడి చేశారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు

తణుకు టౌన్: నాగుల చవితి వేడుకలను తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ, తేతలి, మండపాక తదితర గ్రామాల్లోని పొలాలమధ్యలో గల పుట్టలవద్ద నాగదేవతలకు పూజలు నిర్వహించారు.



సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం



అత్తిలి: నాగమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా నాగుల చవితి వేడుకలు

అత్తిలి: నాగుల చవితి వేడుకలు మండలంలో వాడవాడలా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం ఉదయం మహిళలు, చిన్నారులు గ్రామ శివారు ప్రాంతాలు, చేలగట్లుపై ఉన్న పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రునికి పూజలు చేసారు. పుట్టల వద్ద చిన్నారుల శిరస్సుపై నుంచి బూరెలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. బాణ సంచా కాల్చుతూ ఆనందంగా గడిపారు.

అత్తిలి బస్‌స్టేషన్‌సెంటర్‌లోగల శ్రీనాగమ్మ అమ్మవారి ఆలయం వద్ద నాగుల చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణం వద్ద కృత్రిమంగా ఏర్పాటుచేసిన పుట్టవద్ద భక్తులు పూజలు జరిపారు. నాగమ్మ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ తలారి బాబు, కమిటీ సభ్యులు నరుకుల వీరరాఘవులు, సంకు బుజ్జి, నూకల వెంకన్నబాబు,మిద్దే సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. అత్తిలి గంటావారిపుంతలో కొలువై ఉన్న శ్రీకొండలరాయుడు ఆలయం వద్ద నాగుల చవితి వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయప్రాంగణంలో ఉన్న పుట్ట వద్ద భక్తులు పూజలు చేసారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు గొట్టుముక్కల సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు.

పెంటపాడు: మండలంలో నాగులచవితి వేడుకలు పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పడమరవిప్పర్రు సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం, మీనవిల్లూరు నాగమ్మతల్లి ఆలయం, ప్రత్తిపాడు పైళ్లమ్మ గుడి వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం, రాచర్ల శివాలయం, దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామి వారి ఆలయం, పెంటపాడు ఊరచెరువుగట్టు వద్ద ఉన్న ఆలయాలు నాగేంద్రుని పుట్టల వద్ద మహిళలు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

ద్రోహులను దూరంగా ఉంచండి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం అర్బన్ : మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణపై వ్యక్తిగత దూషణలకు జనసేన నాయకులు పాల్పడటం సరికాదని మాజీ ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ హితవు పలికారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పోలవరం ఎత్తు తగ్గింపు, వీకర్స్‌కాలనీలోని హత్యలు గురించి మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడితే దానికి సమాధానం ఇవ్వకుండా ఆయనపై వ్యక్తిగత దూషణలకు జనసేన నాయకులు పాల్పడటం శోచనీయమన్నారు. గతంలో ఉపముఖ్యమంత్రి వద్ద ఉండి తన సొంత కార్యకలాపాలు నెరవేర్చుకొన్న బిల్డర్ మారం వెంకటేశ్వరరావు ప్రస్తుతం ఎమ్మెల్యే పంచన చేరి మాజీ ఉపముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన రోడ్లను తాము మంజూరు చేసినట్లు శాసనసభ్యుడు చెప్పుకుంటున్నారన్నారు. కృష్ణయ్యపాలెం – అప్పారావుపేట, మెట్ట ఉప్పరగూడెం – ఇటుకులగుంట, కృష్ణయ్యపాలెం రింగురోడ్డు – నవాబుపాలెం, మెట్ట ఉప్పరగూడెం – ఎల్‌అగ్రహారం రోడ్లు ఒక ప్యాకేజీగా పంచాయతీరాజ్ శాఖ పనులు ప్రారంభిస్తుందని తెలిపారు. వీటికి సంబంధించిన నిధులను కొట్టు సత్యనారాయణ మంజూరు చేయించారనే విషయాన్ని స్థానిక శాసనసభ్యుడు గమనించాలన్నారు. ఆరుగొలను – ప్రత్తిపాడు రైల్వే గేటు రోడ్డు అందులో భాగమేనన్న విషయాన్ని శాసనసభ్యుడు తెలుసుకోకపోవడం విచిత్రంగా ఉందన్నారు. బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి సేవ చేశానని చెప్పుకుంటున్న ఒక మాజీ సైనికుడు మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణపై అసభ్య పదజాలంతో విమర్శలు చేయడం సరికాదన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని చెప్పారన్నారు. దీనిని బట్టి రాష్ట్ర ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారన్నారు. శాసనసభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తీసుకొని శాంతిభద్రతలను కాపాడాలన్నారు. శాంతిభద్రతలు కాపాడి మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో బంగారు నాగు, దండే చినగోతియ్య, మానుకొండ వెంకటేశ్వరరావు, బోణం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌కు పరికరాలు సమకూర్చాలని వినతి



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతి పత్రం అందజేస్తున్న అత్తిలి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

అత్తిలి: నర్సాపురం ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను మంగళవారం అత్తిలి లయన్స్‌క్లబ్ సభ్యులు కలిసారు. అత్తిలిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన డయాలసిస్, మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్‌కు కావాల్సిన డయాలసిస్ మిషనరీకి సహాయం అందజేయాలని లయన్స్‌క్లబ్ సభ్యులు కేంద్ర మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారని క్లబ్ ప్రతినిధి యాతం రాంబాబు తెలిపారు. డయాలసిస్ యూనిట్‌కు అవసరమైన పరికరాలను సమకూర్చాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఆదేశించారని చెప్పారు. అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని క్లబ్ ప్రతినిధులు మంత్రిని కోరారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు దాసం బాబ్జి, బుద్దరాతి భరణీ ప్రసాద్, శీతాల వెంకటనారాయణ, బండి గంగాధరరావు,దొండమూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపుల సభ్యుల వివరాలు నమోదు చేయాలి



ఆర్పీలకు సూచనలు చేస్తున్న మెప్మా అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రభుత్వం ఆదేశాల మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్‌లో డ్వాక్రా గ్రూపుల సభ్యుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని మెప్మా తాడేపల్లిగూడెం సీఎంఎం బీహెచ్ శ్రీనివాస్, తణుకు సీఎంఎం శివప్రసాద్‌లు ఆదేశాలిచ్చారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో తాడేపల్లిగూడెం, తణుకు డ్వాక్రా గ్రూపుల ఆర్పీలకు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా బీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రూపుల్లో నూతనంగా చేరిన సభ్యుల పేర్లు సక్రమంగా నమోదు చేయాలన్నారు. మృతి చెందినవారి వివరాలను, మానివేసిన వారి వివరాలను తొలగించి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన నూతనంగా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ నందు నూతనంగా చేరిన సభ్యుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఆర్థిక లావాదేవీలు, జీవనోపాధి పలు అంశాలపై శిక్షణ నిర్వహించారు.

భక్తాంజనేయ ఆలయంలో భక్తుల రద్దీ

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో కొలువైఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం కావడంతో ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్ దంపతులు స్వామి వారికి అభిషేకము చేయడానికి రూ.15,000 విలువైన ప్రత్యేక ఇత్తడితో చేసిన పూజాపాత్రను ఆలయం కమిటీకి అందజేసారు. అదేవిధంగా ఆలయంలో సేవచేస్తున్న 20 మంది స్త్రీలకు చీరలను సర్పంచ్‌దంపతుల చేతుల మీదుగా అందించారు. సర్పంచ్ కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు.

సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటాం

ఉండి: చేసిన వాగ్దానాలు నెరవేర్చాలని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించే వారందరిపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తుందని ఇది ముమ్మాటికీ వ్యక్తి స్వేచ్ఛను హరించడమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి గొర్రుముచ్చు సుందర్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఊపందుకుంటున్న అనధికార లేఅవుట్లు



మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా కొండాలమ్మగుడి వెనుక ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న అనధికార లేఅవుట్



కొండాలమ్మ గుడి పక్కన చెరువును పూడ్చివేసిన ఏర్పాటు చేసిన లేఅవుట్

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెంలో మళ్లీ అనధికార లేఅవుట్లు జోరందుకుంటున్నాయి. గతంలో 2014–19 టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో గూడెంలో అక్రమంగా అనధికార లేఅవుట్లు ఉబ్బడిముబ్బడిగా వెలిశాయి. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనధికార లేఅవుట్లకు చెక్ పడింది. ప్రస్తుతం 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల కాలంలోనే పట్టణంలో అనధికార లేఅవుట్లు ఊపందుకున్నాయి. కూటమిలోని జనసేన పార్టీకి చెందిన కొందరు నాయకులు ఈ అక్రమ లేఅవట్లుకు తెరలేపారు. స్థానిక కొండాలమ్మ గుడి పక్కన ఉన్న చెరువును గతంలోనే పూడ్చివేసి స్థలాలుగా మార్చారు. ఇప్పుడు అదే ప్రాంతంలో కొండాలమ్మ గుడి వెనుక ప్రాంతంలో సైతం అనధికార లేఅవుటును ఏర్పాటు చేస్తున్నారు. ఈవిషయంపై మున్సిపల్ అధికారుల దృష్టికి రాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రస్తుతం ఈ లేఅవుటును ఏర్పాటు చేస్తున్న వ్యక్తులు జనసేనకు చెందినవారుగా చెబుతున్నారు. వడ్డించే వాడు మనవాడైతే అన్నీ మనదగ్గరకే వస్తాయన్న చందంగా కూటమి అనుయాయులు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. గతంలో ఉన్న పంటభూమిలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న అనధికార లేఅవుట్‌తో పాటు సమీపంలో ఉన్న విమానాశ్రయ భూములను ఆక్రమించి అక్రమ లేఅవుట్ వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొందరు ఆ ప్రాంతాన్ని పరిశీలించి లేఅవుట్ ఏర్పాటుకు అనుమతి ఉందా అని ప్రశ్నించడంతో ప్రస్తుతం కంకరతో పూడుస్తున్న కార్యక్రమాన్ని నిలిపివేశారు.

ఆక్రమణలో విమానాశ్రయ భూములు

కొండాలమ్మ గుడి వెనుకప్రాంతంలో కొబ్బరి చెట్లను తొలగించి ఏర్పాటు చేస్తున్న అనధికార లేఅవుట్ ప్రాంతానికి సమీపంలో ఉన్న విమానాశ్రయ భూములను ఆక్రమించి అక్రమంగా లేఅవుట్‌ను ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అనధికార లేఅవుట్ విషయంపై తాడేపల్లిగూడెం ఆర్డీఓ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. దీనిపై ఆర్డీఓ ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



గతం నుంచి తాడేపల్లిగూడెం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ విధులు నిర్వహించిన వరప్రసాద్ బదిలీపై తణుకు వెళ్లారు. ఈనెల 1వతేదీన వీరమల్లు జగదీష్ టౌన్ ప్లానింగ్ ఆఫీసరుగా వచ్చారు. మున్సిపల్ అనుమతి లేకుండా ఏర్పాటుచేస్తున్న లేఅవుట్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– ఏసు, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్